కరీంనగర్‌లో కలెక్టరేట్ ఎదుట ధర్నా అనంతరం డీఆర్‌వోకు వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సైదాపూర్: ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

చిగురుమామిడి: చిన్నముల్కనూర్‌లో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రుణమాఫీపై ఏదీ చిత్తశుద్ధి?

- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసిన బీఆర్ఎస్ నేతలు
- జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు
- కలెక్టరేట్ ఎదుట ధర్నా
- మండల కేంద్రాల్లో రాస్తారోకోలతో నిరసన

రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని, రాష్ట్రంలో సగం మందికి కూడా రుణమాఫీ చేయకపోవడం సర్కారు చిత్తశుద్ధిని చెప్పకనే చెబుతున్నదని బీఆర్ఎస్ నాయకులు దుయ్యబట్టారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు గురువారం జిల్లా వ్యాప్తంగా రైతులతో కలిసి ధర్నాలు నిర్వహించి, ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేసే దాకా తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.

కార్పొరేషన్, ఆగస్టు 22: జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ ధర్నా చేశారు. ధర్నా ఆరంభంలో తెలంగాణ తల్లి విగ్రహం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి తీరును నిరసిస్తూ తెలంగాణ తల్లి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు మాట్లాడుతూ, ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలన్నారు. తెలంగాణ ఉద్యమానికి రాజీవ్‌గాంధీకి ఏమైనా సంబంధం ఉందా అని ప్రశ్నించారు. ఆయన విగ్రహాన్ని సచివాలయం ఎదుట ఎలా ఏర్పాటు చేస్తారని నిలదీశారు. పిల్లల ముందు సీఎం స్థాయి తన స్థాయిని మరిచి కేసీఆర్‌పై అసభ్యంగా మాట్లాడడం సరికాదన్నారు. వెంటనే రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ, కాంగ్రెస్ ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన మాటను నిలుపుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో తప్పుడు ప్రచారాలు చేసి మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఏం మాయరోగం వచ్చిందని హామీలను అమలు చేయడం లేదని దుయ్యబట్టారు. రుణమాఫీపై ప్రభుత్వంలోని మంత్రులు ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ఈ పద్ధతి మార్చుకోవాలన్నారు. నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. తప్పుడు ప్రచారాలతో రైతులను ఆగం చేయవద్దని సూచించారు. ధర్నా అనంతరం డీఆర్‌వో పవన్‌కుమార్‌కు బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు, బీఆర్ఎస్ మండల నాయకులు శ్యాంసుందర్, శ్రీనివాస్‌గౌడ్, మాజీ మేయర్ రవీందర్‌సింగ్, గ్రంథాలయ మాజీ చైర్మన్ పొన్నం అనిల్‌గౌడ్, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్, ఆగస్టు 22: నియోజకవర్గ కేంద్రం హుజూరాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తా బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళనతో దద్దరిల్లింది. ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలంటూ బీఆర్ఎస్ నాయకురాలు, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధికాశ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ధర్నా, రాస్తారోకో చేపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దాదాపు అరగంట రాస్తారోకో చేసిన తర్వాత, పోలీసులు బలవంతంగా నాయకులను డీసీఎం వ్యానులో ఎక్కించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. టూరిజం శాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ పోలీస్‌స్టేషన్‌లో నాయకులను పరామర్శించారు. పోలీసులతో మాట్లాడి నాయకులు, కార్యకర్తలను విడిపించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్ రావు, సింగిల్‌విండో అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, పార్టీ పట్టణ మండలాధ్యక్షులు సంగెం అయిలయ్య, కొలిపాక శ్రీనివాస్, నాయకులు చొల్లేటి కిషన్‌రెడ్డి, గందె శ్రీనివాస్, ఇరుమల్ల సురేందర్ రెడ్డి, పావనిగౌడ్, మంద సతీశ్, కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులున్నారు.

సైదాపూర్, ఆగస్టు 22: మండల కేంద్రంలో రైతులతో కలిసి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా, నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం మండల తహసీల్దార్, వ్యవసాయాధికారులకు రూ.2 లక్షల రుణమాఫీ, రైతుభరోసా విడుదల చేయాలని వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య, జిల్లా నాయకులు, మాజీ ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి, వెన్నంపల్లి సింగిల్‌విండో అధ్యక్షుడు బిల్ల వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధానకార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు రావుల రవీందర్‌రెడ్డి, తిప్పారపు సారయ్య, సంపత్, ఓదెలు, ప్రకాశ్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, రేగుల అశోక్, గాజర్ల ఓదెలు, చాడ ఆదిరెడ్డి పాల్గొన్నారు.

చిగురుమామిడి, ఆగస్టు 22 : చిగురుమామిడి మండలం చిన్న ముల్కనూర్ గ్రామంలోని బస్టాండ్ వద్ద బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. దీంతో కరీంనగర్, హుస్నాబాద్ వెళ్లే వాహనాలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ఎస్ఐ బండి రాజేశ్, పోలీసులు ఆందోళన చేస్తున్న నాయకులను రోడ్డుపై నుంచి ఒక్కొక్కరిని పక్కకు తరలించారు. అనంతరం బీఆర్ఎస్ జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి, సాంబారి కొమురయ్య, సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య మాట్లాడుతూ, ప్రభుత్వం రుణమాఫీకి సంబంధించి అడ్డగోలు ఆంక్షలతో రైతులకు కుచ్చుటోపీ పెట్టిందని మండిపడ్డారు. అలాగే తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ బస్టాండ్ వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ వైస్ ఎంపీపీ భేతి రాజిరెడ్డి, మండల నాయకులు పెసరి రాజేశం, రామోజు కృష్ణమాచారి, బుర్ర తిరుపతి, ఎండీ సర్వర్ పాషా, ఎస్కే సిరాజ్, ముప్పిడి వెంకట నరసింహారెడ్డి, సన్నిల్ల వెంకటేశం, ముప్పిడి రాజిరెడ్డి, బెజ్జంకి లక్ష్మణ్, చెప్యాల నారాయణ రెడ్డి, వర్ణ వెంకటరెడ్డి, దుడ్డేల లక్ష్మీనారాయణ, సందీప్ రెడ్డి, బరిగెల సదానందంతో పాటు మండలానికి చెందిన నాయకులు, వివిధ గ్రామాల అధ్యక్షులు పాల్గొన్నారు.

గంగాధర, ఆగస్టు 22: మండలంలోని మధురానగర్ చౌరస్తాలో ధర్నా, రాస్తారోకో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు మాట్లాడుతూ, ప్రభుత్వం రైతులందరికీ రుణమాఫీ చేయకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల మధుసూదన్, కంకణాల విజేందర్‌రెడ్డి, వేముల దామోదర్, వేముల అంజి, రామిడి సురేందర్, వడ్లూరి ఆదిమల్లు, గంగాధర వేణు, మామిడిపెల్లి అఖిల్, గంగాధర మోహన్, గంగాధర నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: పట్టణంలో ధర్నాలో పాల్గొన్న బీఆర్ఎస్ మహిళా నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

గంగాధర: మధురానగర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హిందూ ధర్మాన్ని కాపాడాలి

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 22 : విశ్వహిందూ పరిషత్ 60 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో గురువారం రేకుర్తిలోని గల బుడగ జంగాల కాలనీలో హిందూ మత విశిష్టత, ప్రాధాన్యతపై విస్తృత ప్రచారం నిర్వహించారు. దీనికి హాజరైన గోరఖ్‌పూర్ మఠాధిపతి అతిథి స్వామీజీ మాట్లాడుతూ, హిందూధర్మాన్ని కాపాడడం ప్రతి హిందువు బాధ్యతగా గుర్తించాలన్నారు. విభాగ్ గోరక్ష ప్రముఖ్ ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి, నగర అధ్యక్షుడు ఇనగటి రమేశ్, వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలసదనం బాలిక దత్తత

కలెక్టరేట్, ఆగస్టు 22 : జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన దంపతులకు సంతానం కలుగకపోవడంతో, పిల్లల కోసం జిల్లా సంక్షేమ శాఖలో దరఖాస్తు చేసుకున్నారు. వీరికి బాలసదనంలో గల పదేళ్ల పాపను దత్తత తీసుకోవాలని, అధికారులు సూచించగా అంగీకరించారు. దీంతో, దత్తత ఇచ్చేందుకు చట్టబద్ధంగా ఏర్పాట్లు చేయడంతో గురువారం కలెక్టరేట్ సమావేశమందిరంలో వారికి చిన్నారితో పాటు సంబంధిత పత్రాలు కలెక్టర్ పమేలా సత్పతి చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో సంక్షేమాధికారి సరస్వతి, పీవో తిరుపతి, శిశుగృహ మేనేజర్ తేజస్వి, సిబ్బంది కవిత, రాజేశ్ పాల్గొన్నారు.

'క్రైస్తవులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం'

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 22: క్రైస్తవులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ రాజ్ పేర్కొన్నారు. స్థానిక సీఎస్ఐ చర్చి ఆవరణలో గురువారం కరీంనగర్ క్రిస్టియన్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా పోస్టర్లు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్య, వైద్య రంగాల్లో మైనారిటీ విద్యార్థులకు అందిస్తున్న తోడ్పాటును వివరించారు. సీఎస్ఐటీఏ ఆల్ ఇండియా బెన్నిషరీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జి. కృపాదానం మాట్లాడగా, ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఎం క్రిస్టఫర్, కార్యదర్శి ఏ సురేశ్, వీపీఎస్ బాల నాయక్, ప్రేంకుమార్, ముస్తఫా, సువార్త, ప్రసాద్, కొమ్మాలు, దేవదాసు, పవన్ పాల్గొన్నారు.

కేజీబీవీ లో పరిచయ్ శిబిరం

చిగురుమామిడి, ఆగస్టు 22: మండల కేంద్రంలోని కేజీబీవీలో పది రోజుల పరిచయ్ శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. ఇందులో భాగంగా యుక్త వయసులోని బాలికలకు అవసరమైన జ్ఞానం, జీవిత నైపుణ్యాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు కేజీబీవీ ప్రత్యేక అధికారి సుజాత తెలిపారు.

వావిలాల ఖాదీ కార్యకర్తల నిరసన

జమ్మికుంట, ఆగస్టు 22: ఏళ్లకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను సంబంధిత శాఖ మంత్రి వెంటనే పరిష్కరించాలని కోరుతూ.. వావిలాల ఖాదీ కార్యకర్తలు విధులను కొద్దిసేపు బహిష్కరించి నిరసన తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించకుంటే సేల్స్ భండార్, ఉత్పత్తి కేంద్రాల్లో విధులను బహిష్కరిస్తామని, ప్రధాన గేట్ల ఎదుట బైఠాయిస్తామని హెచ్చరించారు. ఇక్కడ బీవైగిరి, సతీశ్, సంపత్, రాజయ్య, తదితరులున్నారు.

కేవీకేలో 'పీఎం కుసుమ్'పై రైతులకు అవగాహన

జమ్మికుంట, ఆగస్టు 22: పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో పీఎం కుసుమ్ పథకంపై ఉద్యానవన శాస్త్రవేత్త వేణుగోపాల్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆప్కాస్ట్ రిటైర్డ్ ప్రాజెక్టు అధికారి సుబ్బారావు, ఎస్ఎస్ఎస్ఐ అధికారి భానుశ్యాం, కేవీకే ప్రధాన కార్యదర్శి విజయగోపాల్‌రెడ్డి, కేవీకే సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ వెంకటేశ్వర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ఈ పథకం కింద ప్రతి రైతు 60శాతం సబ్సిడీపై సోలార్ ఇరిగేషన్ పంపు ఏర్పాటు చేసుకునే వీలుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కుసుమ్ పథకానికి దరఖాస్తు, సోలార్ ఏర్పాటు, విద్యుత్ తయారీ, అమ్మకం, తదితర అంశాలను రైతులకు వివరించారు.

సాయి ఆలయంలో మేయర్ దంపతుల అన్నదానం

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 22 : శ్రావణమాసం సందర్భంగా గురువారం భాగ్యనగర్ సాయిబాబా ఆలయంలో మేయర్ సునీల్ రావు –అపర్ణ దంపతులు అన్నదానం చేశారు. అంతకు ముందు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 22 : జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ శ్రీనివాసరావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, డ్రగ్స్, గంజాయి, ధూమపానం వంటి వ్యసనాలకు యువత బానిసైతే జీవితమే అంధకారం అవుతుందని చెప్పారు. జీవితాలు బాగుండాలంటే విద్యకు మించిన ఆయుధం మరొకటి లేదని సూచించారు. ఇక్కడ ఎన్ఎస్ఎస్ అధికారి ధనపురి సాగర్, చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా కోఆర్డినేటర్ ఏ సంపత్, ఎక్సైజ్ ఎస్ఐ రాబర్ట్, సామాజిక సేవకురాలు కవిత దేవి, బైరి మహేశ్, సంపత్ కుమార్, శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలు: 40 వాహనాలు సీజ్

హుజూరాబాద్ టౌన్, ఆగస్టు 22: పట్టణంలోని ఆర్టీసీ డిపో క్రాస్ వద్ద పట్టణ సీఐ జి.తిరుమల్ ఆధ్వర్యంలో గురువారం పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నంబర్ ప్లేట్ లేని, అస్తవ్యస్తంగా నెంబర్ ప్లేట్లు కలిగి ఉన్న 40 ద్విచక్ర వాహనాలను గుర్తించి సీజ్ చేసినట్లు పట్టణ సీఐ తెలిపారు.

కార్మికుల కృషి వల్లే నగరానికి అవార్డులు: మేయర్

కార్పొరేషన్, ఆగస్టు 22: నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుధ్య కార్మికులు చేస్తున్న కృషి వల్లే నగరపాలక సంస్థకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అవార్డులు వచ్చాయని మేయర్ యాదగిరి సునీల్‌రావు పేర్కొన్నారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని సమావేశ మందిరంలో కార్మికులకు గ్లౌజ్‌లు, బూట్లు తదితర వస్తువులను అందించారు. కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తమ పాలకవర్గం కృషి చేస్తున్నదన్నారు. కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ, కార్మికులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణీహరిశంకర్, కార్పొరేటర్లు, నగరపాలక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వేగంగా ప్రాసెస్ చేయాలి

కార్పొరేషన్, ఆగస్టు 22: ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 2020కి సంబంధించిన 16 వేలకు పైగా ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వేగంగా ప్రాసెస్ చేయాలని కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయ సమావేశ మందిరంలో ఎల్ఆర్ఎస్‌పై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రెవెన్యూ శాఖ ఆర్ఐలు, ఇరిగేషన్ ఏఈలు, నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు కమిటీగా ఏర్పడి కేటాయించిన ఏరియా ప్రకారం ప్రత్యేక సర్వే చేపట్టాలన్నారు. రేపటి నుంచే క్షేత్రస్థాయిలో సర్వే చేసి ఫొటోలు సహా జియో ట్యాగింగ్ ద్వారా అప్‌లోడ్ చేసి ప్రాసెస్ చేయాలన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల సమస్యలపై ప్రజల సందేహాల నివృత్తికి ప్రత్యేక హెల్ డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. అంతకుముందు నగరపాలక సంస్థలోని వివిధ విభాగాలను ఆమె సందర్శించి పనితీరును పరిశీలించారు. సమావేశంలో ఆర్‌డీవో మహేశ్వర్, నగరపాలక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన డిప్యూటీ మేయర్

కార్పొరేషన్, ఆగస్టు 22: కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన చాహత్ బాజ్‌పాయ్‌ని గురువారం డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణీ హరిశంకర్ మున్సిపల్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకు పూలమొక్కను అందించారు.

సీజనల్ వ్యాధులపై సమీక్ష

విద్యానగర్, ఆగస్టు 22 : జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత సమీక్షా సమావేశం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు, ఎంఎల్‌హెచ్‌పీ వైద్యులకు సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పీహెచ్‌సీల్లో ప్రసవాలు పెరిగేలా చూడాలన్నారు. సమావేశంలో వైద్యాధికారులు సాధిక, సన, ఉమాశ్రీ తదితరులు పాల్గొన్నారు.

విజృంభిస్తున్న జ్వరాలపై డీఎంహెచ్‌వో ఆరా

శంకరపట్నం, ఆగస్టు 22 : మండలంలో విజృంభిస్తున్న జ్వరాలపై జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ఉమాశ్రీరెడ్డి ఆరా తీశారు. గురువారం ఆమె మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. తాడికల్‌లో ఫీవర్ సర్వే, డెంగ్యూ జ్వరాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. తాడికల్ గ్రామంలో క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. జ్వర పీడితుల వివరాలు, కారణాలు, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై సమీక్షించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్‌కు పలు సూచనలు చేశారు. ఇద్దరు రోగులకు చెందిన రక్త నమూనాలను సేకరించి జిల్లా కేంద్రానికి పంపించారు. ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పారమిత హెరిటేజ్ పాఠశాలలో క్రీడా పోటీలు

కొత్తపల్లి, ఆగస్టు 22 : జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో గురువారం విద్యార్థులకు క్రీడాపోటీలను నిర్వహించారు. పోటీలను పాఠశాల డైరెక్టర్ రమణ ప్రారంభించారు. దీనిలో భాగంగా మూడు రోజుల పాటు విద్యార్థులకు బాస్కెట్‌బాల్, వాలీబాల్, త్రోబాల్, క్రికెట్, క్యారమ్స్, చెస్ పోటీలను జూనియర్, సీనియర్ విభాగంలో నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు రశ్మిత, ప్రసూన, అనూకర్‌రావు, వినోదరావు, వియుయం ప్రసాద్, రమణ, హన్మంతరావు, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలి

గన్నేరువరం, ఆగస్టు 22: గునుకుల కొండాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో కేవలం ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉండడంతో విద్యార్థులు చదువులో వెనుకబడుతున్నారని గ్రామస్తుడు చొక్కాల శ్రీశైలం తెలిపారు. దీనిపై రెండు రోజులుగా ఎంఈవో సంప్రదించడానికి ప్రయత్నం చేశామని, అయితే ఆయన ఫోన్ స్విచ్ఛాఫ్ చేశారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పాఠశాలకు నూతన ఉపాధ్యాయులను నియమించాలని గురువారం ఒక ప్రకటనలో కోరారు.

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ

రాంనగర్, ఆగస్టు 22 : కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని హుజూరాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్, రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి తనిఖీ చేశారు. కార్యాలయాల్లో గల పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహించారు. త్వరగా వాటిని పూర్తి చేయాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో హుజూరాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ గుర్రం తిరుమల్, రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పులి వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.

కరీంనగర్ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో తనిఖీలు

రాంనగర్, ఆగస్టు 22: విజిబుల్ పోలీస్‌లో భాగంగా కరీంనగర్ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కిసాన్‌నగర్‌లో ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చి తాత్కాలిక గుడిసెలు నిర్మించుకుని ఉంటున్న వారి ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించామని కరీంనగర్ టౌన్ డివిజన్ ఏసీపీ నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. వారి వివరాలు సేకరించామని, వారిని పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్ ద్వారా తనిఖీలు చేశామని చెప్పారు. కార్యక్రమంలో కరీంనగర్ త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ జాన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మానకొండూర్ రూరల్, ఆగస్టు 22: జగ్గయ్యపల్లి గ్రామానికి చెందిన పిట్టల ప్రవీణ్ (33) హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మానకొండూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్టల ప్రవీణ్ కరీంనగర్‌లోని ఓ చిట్‌ఫండ్‌లో పని చేస్తున్నాడు. ప్రేమ వివాహం చేసుకొని మానకొండూర్‌లో నివాసం ఉంటున్నాడు. చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపం చెంది నాలుగు రోజుల క్రితం గడ్డి మందు తాగగా, కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ ప్రవీణ్ గురువారం మృతి చెందాడు. అతడికి తల్లి రాజేశ్వరి, తండ్రి సారయ్యతో పాటు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మైలారంలో వృద్ధుడు..

గన్నేరువరం, ఆగస్టు 22: మైలారం గ్రామానికి చెందిన కాదసి ఎల్లాస్వామి (65) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్సై తాండ నరేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 19న మండలకేంద్రంలోని తహసీల్ కార్యాలయం ఎదుట జరిగిన ప్రమాదంలో మండలకేంద్రానికి చెందిన బుర్ర రాజకోటి, మైలారానికి చెందిన ఎల్లాస్వామి గాయపడగా, స్థానికులు అంబులెన్స్‌లో కరీంనగర్‌లోని ఓ హాస్పిటల్‌కు తరలించారు. రాజకోటి చికిత్స పొందుతుండగా, ఎల్లాస్వామి మృతి చెందాడు. కాగా, ప్రమాద ఘటనపై బుర్ర రాజకోటి, మృతుడు ఎల్లాస్వామి కూతురు కాదసి వనజ ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుండె పోటుతో ఆటో డ్రైవర్ మృతి

మానకొండూర్ రూరల్, ఆగస్టు 22: చెంజర్ల గ్రామానికి చెందిన ముత్యాల అంజిరెడ్డి (45) ఆటో డ్రైవర్ గుండెపోటుతో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. అంజిరెడ్డి గురువారం సాయంత్రం సమయంలో ఛాతిలో నొప్పి వచ్చి పడిపోయాడు. కుటుంబ సభ్యులు దవాఖానకు తరలించే ఏర్పాటు చేస్తున్న క్రమంలోనే మృతి చెందాడు. అంజిరెడ్డి ఆటో నడుపుకొంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతడికి భార్య లత, కుమారుడు హర్షిత్ రెడ్డి (12), కుమార్తె శివ హర్షిణి (10) ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

సైదాపూర్, ఆగస్టు 22: ఘనపూర్ గ్రామంలో ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ ఆరోగ్యం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మజ్జిగ కొమురయ్య(90) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నెల 21న జీవితంపై విరక్తిచెంది ఇంటిముందర పందిరికి తాడుతో ఉరేసుకుని మృతిచెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెల